www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 13 మే 2025

24, 25 తేదీల్లో నరసాపురంలో
సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు ఈ నెల 24, 25 తేదీల్లో నరసాపురం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లావ్యాప్తంగా 200 మంది నాయకులు విచ్చేస్తారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం విచ్చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారని పేర్కొన్నారు.

'సహకారం'లో త్రిసభ్య కమిటీలే..!

వారం, పది రోజుల్లో కమిటీలు ప్రకటించనున్నట్లు సమాచారం

ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్ల ప్రకటనతో ఎన్నికలు లేనట్టే

సహకార సంఘాల్లో పదవులపై నాయకుల్లో ఉత్కంఠ

ప్రభుత్వానికి చేరిన రెండు జిల్లాల్లోని 281 సంఘాల త్రిసభ్య కమిటీల జాబితా

జనసేన గెలిచిన నియోజకవర్గాల్లో చెరి సగం పదవులు

టిడిపి ఎంఎల్ఎలు ఉన్నచోట్ల 60:40 ప్రాతిపదికన కేటాయింపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్లను నామినేటెడ్ ప్రాతిపదికన నియమించడంతో సహకార సంఘాలకు సైతం ఎన్నికలు లేనట్లేనని తేలిపోయింది. సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే త్రిసభ్య కమిటీలకు సంబంధించిన నాయకుల జాబితా ప్రభుత్వం వద్దకు చేరినట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో సహకార కమిటీల నియామకంపై ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు కూటమి నాయకులు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమగోదావరి జిల్లాలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు వ్యవసాయానికి సాయం అందించడంలో గ్రామాల్లో సహకార సంఘాల పాత్ర ఎనలేనిది. గతంలో సహకార సంఘాలకు నిర్ణీత గడువు ప్రకారం ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించింది. 2018 జనవరిలో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గాల పదవీకాలం పొడిగించింది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా ప్రతి సహకార సంఘానికీ త్రిసభ్య కమిటీని నియమించింది. డిసిసిబి, డిసిఎంఎస్‌లకు కమిటీలనే నియమించింది. సహకార సంఘాలకు ఒకరు అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులను నియమించి ముందుకు సాగింది. వైసిపి ఐదేళ్ల పాలనలో త్రిసభ్య కమిటీలే కొనసాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంకేతాలు ఇచ్చింది. అప్పటి వరకూ అధికారులు ఇన్‌ఛార్జులుగా నియమించింది. ఏడాది తర్వాత ఇప్పుడు ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీలను నియమించేందుకు సిద్ధమైంది. డిసిసిబి, డిసిఎంఎస్‌లకు ఛైర్మన్లను ప్రకటించింది. కొద్దిరోజుల్లో సభ్యులను కూడా నియమించనున్నారు. అదే సమయంలో సహకార సంఘాల త్రిసభ్య కమిటీలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

పదవుల పంపకం పూర్తి.. జాబితాలు ప్రభుత్వానికి చేరిక

రెండు జిల్లాల్లో 281 సహకార సంఘాలు ఉన్నాయి. త్రిసభ్య కమిటీలను నియమిస్తే 843 మంది నాయకులకు పదవులు దక్కనున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి సహకార సంఘాల పదవులకు సంబంధించి ఒక అంగీకారానికి వచ్చి జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిసింది. రెండు జిల్లాల పరిధిలో ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పోలవరంలో జనసేన ఎంఎల్ఎలు ఉన్నారు. కైకలూరులో బిజెపి ఎంఎల్ఎ గెలిచారు. టిడిపి ఎంఎల్ఎలు ఉన్నచోట్ల 60 శాతం సహకార సంఘాల పదవులు టిడిపికి, 40 శాతం జనసేన, బిజెపికి ఇచ్చేటట్లు అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ఎంఎల్ఎలు ఉన్నచోట మాత్రం చెరి సగం ఇచ్చుకునేలా అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో మొత్తం 17 సొసైటీలు ఉండగా అధ్యక్ష పదవులు టిడిపికి ఎనిమిది, జనసేనకు ఎనిమిది, బిజెపికి ఒకటి ఇచ్చేవిధంగా జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండా త్రిసభ్య కమిటీలను నియమించనున్నట్లు తేలిపోవడవంతో కూటమి నాయకులు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీలను నియమించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దళితులంటే అంత ద్వేషమా..!

కరెంటు కనెక్షన్లు తొలగించాలని తాము కోరలేదని ఆర్అండ్‌బి అధికారులు ఇచ్చిన పత్రాలను చూపుతున్న మాల్యాద్రి, నేతలు, బాధితులు

కరెంటు కనెక్షన్లు ఎందుకు తొలగించారు

ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ఆదేశాలు పాటించాల్సి వస్తుందని అధికారులు చెప్పడం విడ్డూరం

కనెక్షన్లు వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తాం

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

కాళ్లలంక రోడ్డులో బాధిత దళితులకు కెవిపిఎస్ బృందం పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా దళితుల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించడం అన్యాయమని, వాటిని వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన కాళ్లలోని లంక రోడ్డులో ఉన్న దళితుల ఇళ్లను కెవిపిఎస్ బృందం పరిశీలించి, బాధితులను పరామర్శించింది. అనంతరం మాల్యాద్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కాళ్ల లంక రోడ్డులోని పది దళిత కుటుంబాలకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా దుర్మార్గంగా కరెంటు కనెక్షన్లు తొలగించడం అన్యాయమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు చీకట్లో ఉంటూ కొవ్వొత్తుల వెలుగులో చదువుకోవాల్సి రావడం అందరికీ సిగ్గుచేటన్నారు. స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ఆదేశాల ప్రకారమే దళితుల ఇళ్లకు కరెంట్ కట్ చేశారని ఆరోపించారు. కెవిపిఎస్ బృందం 10 దళిత కుటుంబాలను పరిశీలించగా బాధితులు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక ఎఇతో మాట్లాడామన్నారు. ఎంఎల్ఎ ఆదేశాలను పాటించాల్సి వస్తుందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయతీ, ఆర్అండ్‌బి అధికారులు ఎంఎల్ఎ ఆదేశాలతోనే కరెంట్ కట్ చేసినట్లు చెప్పారన్నారు. రికార్డుపూర్వకంగా ఏమైనా ఉందా అని అడిగితే అలాంటిదేమీ లేదని తెలిపారన్నారు. ఈ విషయమై గతంలో ఆర్అండ్‌బి అధికారులు కరెంటు కట్ చేయాలని తాము ఎప్పుడూ అధికారులకు చెప్పలేదని రాతపూర్వకంగానే దళితులకు ఇచ్చారని గుర్తు చేశారు. ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగానే ఎలక్ట్రికల్ ఎఇ, పంచాయతీ అధికారులు కుమ్మక్కై దళితుల ఇళ్లకు కరెంటును కట్ చేశారని, తక్షణం వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులు కరెంటు కట్ చేసినా ఆరు నెలలుగా కరెంటు బిల్లు చెల్లిస్తున్నారన్నారు. తక్షణం కరెంటు ఇవ్వకపోతే రోడ్డెక్కి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయం చూపించే ఇళ్లు తొలగిస్తున్నామని ఎంఎల్ఎ అవాస్తవాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఎసి గదుల్లో ఉండటం కాదని, నియోజకవర్గంలో తొలగించాలనుకుంటున్న ఇళ్లకు వచ్చి బాధితులతో మాట్లాడాలన్నారు. ఈ 10 దళితుల ఇళ్లల్లో ఒక్కో ఇంట్లో 2, 3 కుటుంబాలు నివశిస్తున్నాయని చెప్పారు. తక్షణం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి అప్రతిష్ట అని వ్యాఖ్యానించారు. అధికారులను భయపెట్టి, మభ్యపెట్టి దళితులపై ఆధిపత్యం చెలాయిస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. గతంలో అంబేద్కర్ ఫ్లెక్సీలను చించి దళిత వ్యతిరేకతను ప్రదర్శించారని, ఇప్పుడు దళితుల ఇళ్లకు కరెంటు కట్ చేయించి మరింత ఆధిపత్యం చూపుతున్నారని మండిపడ్డారు.

ప్రత్యామ్నాయం అంటే పట్టాలివ్వడం కాదు.. ఇళ్లు కట్టి ఇవ్వడం

ఇళ్ల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం అంటే ఇళ్ల పట్టాలు చేతిలో పెట్టడం కాదని, ఇళ్లు నిర్మించి ఇవ్వడమని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో ఇళ్లు తొలగిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపుతున్నామని ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చెబుతున్నారని, ప్రత్యామ్నాయం అంటే పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వడమని అన్నారు. ఉన్న ఇళ్లను కూల్చేసి ఖాళీ స్థలాలిస్తే ఇప్పటికిప్పుడు పేదలు ఎక్కడికి వెళ్తారన్నారు. ఇప్పటి వరకూ నివాసముంటున్న పక్కాఇంటికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకునే వరకు అద్దె కూడా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అలాంటి సహకారం పేదలకు అందిస్తేనే ఇళ్ల తొలగింపు కార్యక్రమం పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ, బాధితులు పద్మారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడి వద్దుగాని.. బెల్టుషాపులు ఉండొచ్చా

- 2020 విద్యావిధానం అమలతో ప్రభుత్వ విద్య నిర్వీర్యం
- కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటిస్తాం
- హైస్కూళ్లలో 1:45 నిష్పత్తి ప్రకారం బదిలీలు జరపాలి
- ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- కలెక్టర్ నాగరాణి, డిఇఒ నారాయణకు వినతి

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పిల్లలను చదువుకోడానికి దూరంగా పంపించాలి.. కానీ మద్యం తాగడానికి మాత్రం సందు సందుకు బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా పెట్టారు. ఇదెక్కడి దారుణం గ్రామంలో బడి ఉండకూడదా.. కానీ బెల్టుషాపులు ఎన్నయినా ఉండొచ్చా' అని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి విమర్శించారు. 2020 ఎడ్యుకేషన్ పాలసీ యాక్ట్ అమలుతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగం, విద్యార్థి, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు అవలంబిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో బదిలీలు, ఉద్యోగోన్నతులు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సమస్యలపై సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన ఉపాధ్యాయులు ఎండను సైతం లెక్కచేయకుండా నేలపై బైఠాయించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఇఒ ఇ.నారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేస్తున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కరించట్లేదన్నారు. తల్లికి వందనం ప్రయివేట్ పాఠశాలలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎడ్యుకేషన్ పాలసీ యాక్ట్‌ను కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేసేందుకే తీసుకొచ్చారని విమర్శించారు. ఉన్నత పాఠశాలల్లో 1:45 నిష్పత్తి ప్రకారం బదిలీలు జరపాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలిచి బదిలీలలో అసంబద్ధాలను సరి చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. బడిలో ఉపాధ్యాయులు కాలక్షేపం చేస్తున్నారని చెప్పడం సరైంది కాదన్నారు. వారం రోజులపాటు పిల్లలకు పాఠాలు చెబితే పరిస్థితి మీకు అర్థమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సిహెచ్.పట్టాభిరామయ్య, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, ఎస్.రత్నరాజు, పి.శివప్రసాద్, టిజె.జయకుమార్, కె.బ్రహ్మయ్య, జి.అబ్రహం, సుమారు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాపై చిన్న చూపు తగదు

15వ రోజు కొనసాగిన కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ల నిరవధిక సమ్మె

కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న తమ సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమని, తమ పట్ల చిన్నచూపు తగదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల నుంచి తాము నిరవధిక సమ్మె చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తొలుత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎపి ఎంసిఎ జిల్లా అధ్యక్షురాలు పి.శిరీషరాణి, సెక్రటరీ కె.విజయ సీతారామరాజు మాట్లాడారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించామని, అయినా ఎటువంటి ఫలితమూ లేదని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌పోర్టు, ఎక్స్‌గ్రేషియా, సెలవులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ అనేది ఒక వృత్తి కాదని, ఒక సేవ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిఎంసిఎ ప్యానల్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలి

జిల్లావ్యాప్తంగా 187 అర్జీలు స్వీకరణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ అర్జీలను నిర్ణీత గడువులోపుగా పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులను ఆదేశించారు. సమస్య తమ శాఖ పరిధిలోకి రాదని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖకు బదిలీ చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 187 అర్జీలు స్వీకరించారు. తన ఇద్దరు కుమార్తెలు, భార్య తనను ఇంటి నుంచి గెంటేశారని, తాను ప్రస్తుతం ఉండ్రాజవరం వద్ద ఆశ్రమంలో సొమ్ము కట్టి ఉంటున్నానని, ఇప్పటి వరకు తన మిత్రులు ఆశ్రమానికి డబ్బు కట్టారని, ప్రస్తుతం వారు కూడా డబ్బు కట్టలేమన్నారని తెలిపారు. దీనిపై తాడేపల్లిగూడెం ఆర్‌డిఒకు విన్నవించినా ఎటువంటి స్పందనా లేదని పెంటపాడు మండలం పత్తిపాడు పగలంపాడు గ్రామానికి చెందిన గజ్జరపు శంకర్ నారాయణ ఫిర్యాదు చేశారు. తాను వికలాంగురాలినని (90 శాతం ఆర్థోపెడిక్) ప్రస్తుతం నెలకు రూ.6 వేలు పింఛన్ పొందుతున్నానని, తాను నిలబడే పరిస్థితి లేదని, వీల్‌ఛైర్‌కు మాత్రమే పరిమితమయ్యానని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నానని, తనకు ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలని భీమవరం బలుసుమూడికి చెందిన రమణ కాత్యాయినిదేవి అర్జీ అందించారు. తనకు భీమవరం పట్టణంలో 150 గజాల స్థలం ఉందని, దానిలో ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్నానని, బ్యాంకు రుణానికి దరఖాస్తు చేసుకోగా మున్సిపాల్టీ నుండి ప్లాన్ కావాలన్నారని గొల్లవానితిప్పకు చెందిన ఎన్.రాజేంద్రప్రసాద్ అర్జీ అందజేశారు. దీనిపై మున్సిపాల్టీని సంప్రదిస్తే స్వీయ ధ్రువీకరణ సరిపోతుందంటున్నారని, తనకు ప్లాన్ ఇప్పించాలని కోరారు. దిరుసుమర్రు పంచాయతీ అవినీతికి చిరునామాగా మారిందని, అధికారులు, ఉద్యోగులు అంతా ఏకమై నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పంచాయతీ నిధులు నేరుగా తన సొంత బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకుంటున్నారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని భీమవరానికి చెందిన ఆకుల రమేష్ ఫిర్యాదు చేశారు.

అనంతరం కలెక్టర్ నాగరాణి అధికారులతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అధికారులు అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకుని చక్కని పరిష్కారాన్ని చూపించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలుంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కరించలేకపోతున్నామో అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

పొంచి ఉన్న అతిసార

తూర్పు చెరువులో తేలుతున్న చనిపోయిన చేప

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో పంచాయితీ వారు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమైనట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా తాగునీటి పైపుల ద్వారా వస్తున్న తాగునీరు నీచి వాసన వస్తుంది. ఇదే పరిస్థితి కొద్ది రోజులు కొనసాగితే ఈనీరు తాగుతున్న గ్రామస్తులు అతిసార వ్యాధిన పడే అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తమవుతుంది. తాగునీటి చెరువులలో నీరు తగ్గడంతో అధిక ఉష్ణోగ్రతలకు అందులో నీరు వేడెక్కుతుంది. ఫలితంగా చెరువులో ఆక్సిజన్ స్థాయి తగ్గి ప్రతీరోజు చేపలు చనిపోవడంతో చెరువులోని నీరు కలుషితమవుతున్నట్టు తెలుస్తుంది. చనిపోయిన చేపలను చెరువు నుంచి వెంటనే తొలగించకపోవడంతో అవి కాస్తా కుళ్లిపోయి.. చెరువు నీరు కలుషితమవుతుంది. చెరువు పరిసర ప్రాంతంలోనే నీచి వాసన గుప్పుమంటుంది. గ్రామంలో తూర్పుచెరువు, ఎల్లమ్మ చెరువుల ద్వారా గ్రామానికి రక్షిత తాగునీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం చెరువులలోని నీరు తగ్గదలతో అన్ని చెరువుల నీటిని కలిపి ఒహెచ్ఆర్‌ల ద్వారా సరఫరా చేస్తున్నారు. చేపలు చనిపోయిన చెరువులోని నీరు కూడా పైపులైన్‌లలో కలవడంతో మొత్తం సరఫరా అవుతున్న నీరంతా నీచి వాసన వస్తుంది. ఇదిలా ఉంటే అదనపు సమ్మర్ స్టోరేజ్‌గా ఉపయోగిస్తున్న పీర్లకోడు చెరువులో తూడు పేరుకుపోయింది. ఎండ వేడిమికి తూడు కుళ్లడం ప్రారంభమవుతుంది. కుళుతున్న తూడు వల్ల ఇందులోని నీరు కూడా కలుషితమయ్యే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు తాగునీరు కలుషితమవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



తాడేపల్లిగూడెం టౌన్ : నినదిస్తున్న కార్మికులు

వీరవాసరం : ఉద్యోగ కార్మికులకు నష్టంచేసే లేబర్ కోడ్లను రద్దుచేయాలని కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సోమవారం వీరవాసరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను, కార్మికులను సంఘాలు పెట్టనివ్వకుండా, వారి సమస్యలపై మాట్లాడనివ్వకుండా చేయడానికి లేబర్ కోడ్లను కేంద్ర పాలకులు తీసుకువచ్చారని అన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలే మాకు కావాలని, వాటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని తెలిపారు. సిఐటియు మండల అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడారు. అనంతరం సమ్మె గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యవతి, విఒఎ సంఘం నాయకులు భవాని, మిడ్ డే మీల్ కార్మిక సంఘం నాయకులు మద్దాల శ్రీనివాస్, పంచాయతీ కార్మికసంఘం నాయకులు మల్లుల ఏసుబాబు, వృత్తిదారుల సంఘం నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

తణుకు : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన సమ్మె చేపడుతున్నట్టు ఎఐటియుసి నాయకులు బొద్దాని నాగరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కి సిఐటియు, ఎఐటియుసి సంఘాల తరపున సమస్యలతో కూడిన సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకు కార్మికులు, ఉద్యోగులకు రక్షణగా ఉన్న ఆప్కాస్ నేటి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు గార రంగారావు, వి.రమేష్, జి.వెంకటేశ్వరరావు, నూకరాజు, ఆంజనేయులు, రవికుమార్, శ్రీనివాస్, రాములమ్మ, దుర్గారావు, బొద్దాని మురళీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టౌన్ : ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) సర్వసభ్య సమావేశం స్థానిక పండ్ల మార్కెట్ ఆఫీసు భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఈ దేశంలో ఉన్న పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చూస్తుందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, తట్టాగొట్టి పెద్దిరాజు, కాయల ప్రసాద్, సారికి శ్రీను, పుట్టా యేసు, మద్దూరి ఆనంద్‌రావు, బాసింశెట్టి శ్రీను, సువ్వాడ రాంపండు హాజరయ్యారు.

పెనుగొండ : లేబర్ కోడ్స్ రద్దు కోసం ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఉమ్మడిగా 11 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 20వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. పెనుగొండ నక్కల కాలవ వద్ద పనిచేస్తున్న కార్మికులతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ పాదుషా మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు పి.వెంకట్రావు, సత్యవతి, ఎస్.మంగ, చలుమూరి సత్యవతి, మరడాని నాగలక్ష్మి, కర్రి అరుణ, పూలపల్లి మంగ, మల్లుల దుర్గ పాల్గొన్నారు.

సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత నివాసులకు పట్టాలివ్వాలి

డిఆర్‌ఒకు సిపిఎం నేతలు, బాధితుల వినతి



పంచాయతీ తీర్మాన కాపీలు చూపిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత నివాసులకు ఇళ్ల పట్టాలు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య కోరారు. ఇల్లు తొలగింపు తీర్మానాన్ని మోగల్లు పంచాయతీ వ్యతిరేకిస్తూ చేసిన తీర్మాన కాపీలను భీమవరం కలెక్టరేట్ వద్ద విలేకరులకు చూపించి సంబంధిత పత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య స్థానికంగా ఉన్న సమస్యను డిఆర్ఒ దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. 23 కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి సుబ్బరాజు చెరువు గట్టు ఆనుకొని నివసిస్తున్నారని చెప్పారు. వాటిని తొలగిస్తున్నట్లు ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. అయితే దీన్ని పంచాయతీ పాలకవర్గం వ్యతిరేకించిందని పేర్కొన్నారు. 23 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి వారిని ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నివాసితులు వెంకన్న, బాబి, వాసు, సత్యనారాయణ ఉన్నారు.

తోట మహాలక్ష్మి మృతి తీరని లోటు

సిపిఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - గణపవరం


నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

తోట మహాలక్ష్మి మృతి సిపిఎం కేశవరం శాఖకు తీరని లోటని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం కేశవరం శాఖ అధ్యక్షులు మహాలక్ష్మి నివాసం వద్ద జరిగిన సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పేదలందర్నీ, ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు మహాలక్ష్మి పేద ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి అన్నారు. సిపిఎం నిర్వహించే ప్రజా పోరాటాల్లో ముందుండి పోరాడిన వ్యక్తి అని, ఆయన మృతి కేశవరం ఏరియా పేద ప్రజలకు తీరని లోటని తెలిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభలో సిపిఎం మండల కార్యదర్శి పెన్మెట్స నరసింహరాజు, నాయకులు మేడిశెట్టి పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు, మెండే సూర్యారావు, సోడదాసి సంజీవరావు, గుత్తుల శ్రీనువాసు, తోట ఏసు, కె.ఇజ్రాయిలు రాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యకాస ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

భీమవరం : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని, గ్రామాల్లో వలసలు నివారించి వ్యవసాయ కూలీలందరికీ 200 పనిదినాలు కల్పించి, దినసరి వేతనం రూ.700 ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. బికెఎంయు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం నాయకులు మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి ఉపాధి హామీ కూలీకి సంవత్సరానికి రూ.12 వేల ఉపాధి భృతి ఇవ్వాలని, చేసిన పని సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్లు కొనసాగించాలి

అంబేద్కర్ ఆలోచన వేదిక వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలోని ఎస్సి, ఎస్టి సామాజిక తరగతులకు చెందిన నిరుపేద విద్యార్థుల కోసం విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎపి స్టడీ సర్కిల్స్ నిరంతరం కొనసాగించాలని అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ కోరారు. ఈమేరకు సంబంధిత శాఖ అధికారులను కోరుతూ సోమవారం వినతి పత్రాలు పంపినట్లు ఇక్కడ తెలిపారు. ఏపీ అంబేద్కర్ స్టడీ సర్కిల్స్‌లో పర్మనెంట్ ఆఫీసర్స్, కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసి స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు నిరుద్యోగులకు నిరంతర శిక్షణ జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 2005 నుంచి 2020 వరకు నిరంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం పిపిపి ఆధ్వర్యంలో డిఎస్‌సికి శిక్షణ ఇస్తున్నారు, ఇది సరైన విధానం కాదని, పిపిపి విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆఫీసర్స్, కోఆర్డినేటర్లను నియమించి అన్ని ఉన్నత స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం : ఎంఎల్ఎ

తణుకు : తణుకు నియోజకవర్గంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలో మొత్తం రూ.4.09 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొంటారని తెలిపారు. తణుకు పట్టణంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలు అనంతరం పాలూరు, అత్తిలి, కెఎస్ గట్టు, వేల్పూరు, కె.ఇల్లిందలపర్రు గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రంగస్థలం నటులకు సత్కారం

ఆకివీడు : మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన రంగస్థల కళాకారులు, గాయకులకు ఉరువురి తెలుగు భాష సేవా పురస్కారం లభించింది. ఏలూరులో మహాలక్ష్మి గోపాల స్వామి కళ్యాణమండపంలో శ్రీశ్రీ కళావేదిక ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ రంగస్థల సంబరాలు, ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల కార్యక్రమంలో భాగంగా కళాకారులు, గాయకులు గాదిరాజు చిన అప్పలరాజు, గాదిరాజు హేమ లక్ష్మీనారాయణలను ఆదివారం ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన కళాకారులు సోమవారం స్థానిక విలేకరులకు వివరాలు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ శ్రీకత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ శ్రీకొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి వారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు విలేకరులకు తెలిపారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం: పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 45 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని కాపాడాలి'

పాలకొల్లు రూరల్: ప్రతి ఇంట్లోనూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, ఆ మొక్కలు పెరుగుటకు వర్మీ కంపోస్టు ఎంతైనా అవసరమని, వీటిని అతి తక్కువ ధరకే సచివాలయ పరిధిలో తయారు చేసి అమ్మటం అభినందనీయమని తహాశీల్దార్ దుర్గా కిషోర్ అన్నారు. ఈ వర్మి కంపోస్ట్‌ని ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి మొక్కలకు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. సోమవారం మండల కార్యాలయం వద్ద గోరింటాడ, ఆగర్రు సచివాలయంలో తయారుచేసిన వర్మి కంపోస్ట్‌ను విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. వీటిని ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి ఆధ్వర్యంలో విక్రయించారు. వీటిని తహాశీల్దార్ దుర్గా కిషోర్, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ మూర్తిబాబు, గోరింటాడ గ్రామ సెక్రటరీ సుంకర గాయత్రి, సర్పంచి మండెల పావని నాని, ఎంఇఒ గంగాధర శర్మ, ఎఒ రామదాసు నాయుడు, గుడాల హరిబాబు కొనుగోలు చేశారు.

ఘనంగా కాళ్లకూరు రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న యాత్రికులు

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సోమవారం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. రథాన్ని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు, యాత్రికులు స్వయంగా రథాన్ని లాగారు. ఈరథోత్సవం కోలాటాల నడుమ కొనసాగింది. కాళ్ల గ్రామానికి చెందిన పన్నాసి వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో ఉచిత పులిహోరను యాత్రికులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు, దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, పలు దేవాలయాల ఇఒలు, టిడిపి నాయకులు మంతెన పెదనరసింహరాజు, కనుమూరు భరత్, ఉప సర్పంచి ప్రదీప్ రాజు, మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు, దాట్ల వెంకట రామరాజు తదితరులు రథోత్సవాన్ని తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మొగల్తూరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దారతిప్ప సమీపంలో 216 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రహదారి ప్రమాదంలో యువకుడు సంఘటన ప్రాంతంలోనే మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు అంబేద్కర్ కొనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కామాని దుర్గాప్రసాద్(32) కాళ్లమండలం కలువపూడి పంచాయతీ మోడి గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కాళీపట్నం-దారతిప్ప గ్రామాల మధ్య 216 జాతీయ రహదారికి ఉన్న మలుపు సమీపంలో బొలెరో వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై సంఘటనా ప్రాంతంలోనే మృతిచెందారు. దుర్గాప్రసాద్ తండ్రి సొంతూరు మోడి. ఆయన తండ్రి గతంలోనే మృతిచెందాడు. తల్లి, భార్య, పిల్లలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రమాద బాధితుడికి రూ.26 వేల సాయం

భీమవరం టౌన్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అద్వితీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం 18వ వార్డుకు చెందిన జనసైనికులు మండూరి జయ ప్రకాష్ ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలోని పిస్తా హౌస్ హలీం పాయింట్ భీమవరపు పెద్దిరాజు, సయ్యద్ ఇమ్రాన్, నున్న సూర్య, వద్దునీడి రాము, ఎగ్జిబిషన్ అలీషా, దాసరి భాస్కరరావు, బొల్లాప్రగడ శేషు, జక్కంపూడి సతీష్, మహమ్మద్ నవ్విద్ కలిసి రూ.26 వేలు ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఎ చేతులమీదుగా అందించారు. సమాజసేవ చేయడం భగవత్ సేవతో సమానమని, తోటివారికి సహాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భీమవరపు పెద్దిరాజు, యర్రింకి సూర్యారావు, చల్లా రాము పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల మధ్య తగాదా.. ఒకరు మృతి

కాళ్ల : ఎల్ఎన్ పురం గ్రామం మెండి ప్రాంతంలో ఆదివారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య మద్యం మత్తులో తలెత్తిన వివాదం హత్యకు దారితీసింది. సోమవారం ఈ విషయం తెలియడంతో ఆకివీడు సర్కిల్ సిఐ జగదేశ్వరరావు, కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు, కాళ్ల పోలీస్‌లు సంఘటన స్థలానికి వెళ్లారు. కాళ్ల పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తి కోళ్లలంక గ్రామానికి చెందిన బండి జాన్ యేసు, కోమటిలంక గ్రామానికి చెందిన చెన్నకేశవ అరవింద్ ఇద్దరూ బంధువులు వరుసకు అన్నదమ్ములు. కొంతకాలం క్రితం ఎల్ఎన్ పురం గ్రామం మెండి ప్రాంతంలో చెరువులపై పనిచేయడానికి వచ్చారు. ఇక్కడే కిరణ్ అనే కుర్రవాడు కూడా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ముగ్గురు పనిచేస్తున్న చెరువుపై మద్యం తెచ్చుకున్నారు. తాగిన తర్వాత బంధువులైన జాన్ యేసు, అరవిందులు గొడవపడ్డారు. అరవింద్ జాన్ యేసు ప్రేమిస్తున్న ఆమెపై దుర్భాషలాడిన క్రమంలో అరవింద్ పక్కనే ఉన్న వస్తువుతో జాన్ యేసు మీద దాడి చేయడానికి ప్రయత్నించగా వెంటనే జాన్ యేసు అందుబాటులో ఉన్న కత్తితో అరవిందును పొడిచాడు. పక్కనే ఉన్న కిరణ్ వారించే లోపే ఈ సంఘటన జరిగినట్లుగా తెలుస్తుంది. వెంటనే అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతిచెందారు. దీనిపై కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సు వ్యవస్థకు ఆదర్శం ఫ్లారెన్స్ నైటింగేల్

భీమవరం టౌన్ : నర్సు వ్యవస్థకే ఆదర్శం ఫ్లారెన్స్ నైటింగేల్ అని, తాను ఉన్నత కుటుంబంలో జన్మించినా నర్సింగ్ వ్యవస్థను ఎన్నుకొని లక్షలాది మందికి నర్సుగా సేవలు అందించిన ఫ్లారెన్స్ నైటింగేల్ చిరస్మరణీయురాలని సెయింట్ మేరీస్ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ గ్రేసమ్మ అన్నారు. సోమవారం ఫ్లారెన్స్ నైటింగేల్ జయంతి వేడుకలను శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సెయింట్ మేరీస్ ఆసుపత్రిలో నిర్వహించారు. గ్రేసమ్మ మాట్లాడుతూ తన జీవితాన్ని రోగుల సేవకే అంకితం చేసిన ఫ్లారెన్స్ నైటింగేల్ రోగుల పాలిట ఒక వరమని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రోగులపాలిట దైవస్వరూపంగా వుండే నైటింగేల్ యుద్ధ సమయాలలో క్షతగాత్రులను వెతుక్కుంటూ వెళ్లి వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడిన మహోన్నత మూర్తి ఫ్లారెన్స్ నైటింగేల్ అన్నారు. నైటింగేల్ జయంతిని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకోవడం గొప్ప విశేషమని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సిస్టర్ అనిత్, వైద్యులు డాక్టర్ సిమిలి, సీనియర్ నర్సులు సిస్టర్ జెర్రీ, సిస్టర్ సెల్వ, అనసూయ, వరలక్ష్మి, నిర్మల, జ్యోతిలను సత్కరించారు. అనంతరం కుక్కల బాల సౌజన్యంతో రోగులకు, నర్సులకు మామిడి పండ్లు, అరటిపళ్లను అందించారు.

ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ర్యాలీ

భీమవరం టౌన్ : పాక్ ఉగ్రవాదులను అరికట్టడంలో భారత ప్రధాని మోడీ చేస్తున్న కృషి అద్వితీయమని, పాకిస్తాన్ ఉగ్రవాదులు మన భారత సైనికుల దాడికి భయపడి పారిపోతున్నారని, ఇది యావద్భారతం హర్షించదగ్గ విషయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం కెజిఆర్ఎల్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల కార్యదర్శి మెంటే మనోహర్, సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ మన సైనికులు అనుక్షణం పాక్‌ను ముట్టడించడమే ధ్యేయంగా రణరంగంలో చేస్తున్న ఆపరేషన్ సిందూర్ భారతదేశ సాహసం, భారతీయుల దేశభక్తిని నిరూపిస్తోందని అన్నారు. పాకిస్తాన్‌ను తుదముట్టించడమే ధ్యేయమని తెలిపారు. అనంతరం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, ప్రిన్సిపల్ ఇంటి శ్రీరామచంద్రమూర్తి, పిజి డైరెక్టర్ డాక్టర్ తోట రామ్మూర్తి, డాక్టర్ ఎం.గంగాధర్ రావు, లక్ష్మిఛాయ, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పైపులు ధ్వంసం

ఉండి: ఉండి డిసి పరిధిలోని ప్రధాన పంట కాలువలోకి వదిలేసిన మరుగుదొడ్ల పైపులను, మురుగునీటి పైపులను ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణి ఆధ్వర్యంలోని అఖిలపక్ష సభ్యులు, ఇరిగేషన్ సిబ్బంది మూసివేశారు. ఈ సందర్భంగా తోట ఫణి మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు మహదేవపట్నం నుంచి ఎన్ఆర్‌పి అగ్రహారం వరకు కాలువ వెంబడి ఉన్న నిర్వాసితులు ప్రధాన పంట కాలువలోకి విడిచిపెట్టిన మరుగుదొడ్ల, మురుగునీటి పైపులను ధ్వంసం చేసి వాటిని సిమెంటుతో మూసివేయడం జరిగిందన్నారు. ఎవరైనా వీటిని అతిక్రమించి మూసివేతను తొలగించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, నాయకులు రణస్థుల మహంకాళి, ముదునూరి సుబ్బరాజు, సురవరపు వెంకటాచార్యులు, ముగ్గళ్ల సత్యనారాయణ, కలిశెట్టి వెంకట్రావు, సనపల శ్రీనివాస్, కొత్తకోట నాని పాల్గొన్నారు.

అందరి విజయం : కలెక్టర్

భీమవరం : రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్ అందుకోవడం అందరి విజయమని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో 2024 - 25 సంవత్సరంలో రూ.36 లక్షలు వివిధ శాఖలు సభ్యత్వ రుసుము ద్వారా అందజేయడం జరిగిందని, వినూత్నంగా ప్రభుత్వ శాఖలచే రక్తదాన శిబిరాలు ఏర్పాటు, రూ.3 కోట్లతో బ్లడ్ బ్యాంక్, డేకేర్ తలసేమియా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ముందుండి నడిపించిన జిల్లా కలెక్టర్ నాగరాణి అభినందనీయులన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో జిల్లా రెడ్ క్రాస్‌కు సేవలందిస్తున్న జిల్లా, డివిజన్, మండల అధికారులు, రెడ్ క్రాస్ సభ్యుల సమిష్టి కృషితో జిల్లాకు గోల్డ్ మెడల్‌ను సాధించడం జరిగిందని, ఇది వారందరి విజయం అన్నారు. కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి ఉన్నారు.

ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

నరసాపురం: మండలంలోని లిఖితపూడి గ్రామంలో ఎపిఐఐసి నిధులు రూ.13.60 కోట్లతో నిర్మించే ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం నరసాపురం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, రాష్ట్ర ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ నాయకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సహాయ సహకారాలతో నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చెందేలా కృషిచేస్తానని నాయకర్ అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ జి.జ్యోతి, తహశీల్దార్ అయితం సత్యనారాయణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఎంపిపి మైలబత్తుల సోనీ, జెడ్‌పిటిసి బొక్క రాధాకృష్ణ, పోలిశెట్టి శ్రీనివాస్, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని బోధనలు ఆచరణీయం

అడిషనల్ ఎస్‌పి భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న అడిషనల్ డిఎస్‌పి భీమారావు

ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గౌతమ బుద్ధుడు గొప్ప దర్శనీకుడని, ఆయన చూపిన మార్గం ఆచరణీయమని అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు అన్నారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి భీమారావు మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచం మొత్తానికి ఆదర్శనీయమని అన్నారు. సిఐలు నాగరాజు, వి.పుల్లారావు మాట్లాడుతూ విశ్వ మానవాళికి ప్రేమతత్వాన్ని, అహింసను బోధించిన బుద్ధుని బోధనలు నేటికీ సదా ఆచరణీయమని తెలిపారు. ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెఫ్, జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్ మాట్లాడుతూ రాగద్వేషాలతో, హింసతో సతమతమవుతున్న మానవాళిని జాగృతపరచడానికి ఉద్భవించిన మహాపురుషుడు గౌతమబుద్ధుడన్నారు. ఆ మహానుభావుని బోధనల స్ఫూర్తితో హింసకు, వివక్షకు చోటులేని శాంతియుత సమసమాజాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో గంటా సుందర్ కుమార్, గాతల సందీప్, బేతాళ కమలకర్, బుంగా ఆదామ్ రాజు, ఈది శేఖర్, ప్రశాంత్, పిల్లి మునలయ్య, దాసు, కె.లాజర్, కేసిరాజు, కొల్లి శ్రీనివాస్, నరసింహం, గుంటి ప్రభు, రాజేంద్ర పాల్గొన్నారు.

రీసర్వేలో అవకతవకలపై రైతుల ఆందోళన

కాళ్ల : కాళ్ల గ్రామంలో జరిపిన రీసర్వేలో అవకతవకలు జరిగాయని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కాళ్ల గ్రామ రైతులు నిరసన చేశారు. కాళ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద కాళ్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బ్రిటీష్ వారి కాలంలో జరిగిన సర్వే ప్రకారం కాళ్ల వ్యవసాయ భూముల విస్తీర్ణం సుమారు 3,862 ఎకరాలుగా ఉందన్నారు. ఈనాటికి కూడా కాళ్ల వ్యవసాయ భూమి విస్తీర్ణం 3,862 ఎకరాలు అంటే భూమిలో ఏవిధమైన మార్పు లేదన్నారు. భూములను ఆన్‌లైన్ చేసిన సందర్భంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తహశీల్దార్ సుందర్ సింగ్‌కు వివరించారు. అనర్హులను 1బిలో నమోదు చేయటం వల్ల అర్హులైన మేమంతా రోడ్డున పడ్డామన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేయటం లేదని అసహనం వ్యక్తంచేశారు. కాళ్ల గ్రామంలో రీసర్వే జరిగి చాలాకాలం అయినప్పటికీ ఆ వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించకుండా గోప్యతను ఎందుకు పాటిస్తున్నారని రైతులు ప్రశ్నించారు. రీ సర్వే చేసిన కాళ్ల గ్రామంలో అనేక మంది రైతులకు సంబంధించిన భూముల్లో గతంలో ఉన్న విస్తీర్ణం కంటే తక్కువ విస్తీర్ణం, రైతులకు సంబంధించిన పాసుబుక్‌లలో వారికి సంబంధం లేని సర్వే నెంబర్లను చేర్చి భూ విస్తీర్ణం పెంచేలా భూముల రీ సర్వే నిర్వహించారన్నారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు 2 సెంట్ల నుంచి 40 సెంట్లు భూ వ్యత్యాసం చూపిస్తున్నారని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక బృందంతో రెవెన్యూ రికార్డులను ఆడిట్ చేయించి, ప్రస్తుతం జరిగిన రీసర్వేతో సరిచూసి గ్రామంలోని భూసమస్యలు పరిష్కరించాలన్నారు. దీనిపై స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లనున్నట్లు వారు స్పష్టంచేశారు. కాళ్ల గ్రామ రైతులు తోట కృష్ణ, గనిశెట్టి సురేష్, మైడి శ్రీనివాసు, తోట శ్రీనివాసరావు, గ్రంధి సోమయ్య, గ్రంధి చింతారావు, నిమ్మల సుబ్బారావు, గనిశెట్టి మల్లేశ్వరరావు, బండారు సోమేశ్వరరావు, పోతీనీడి పార్థసారథి, యాతం సత్యనారాయణ, నిమ్మల లోకేష్ పాల్గొన్నారు.

రుణాలు మంజూరు, రికవరీలో జిల్లాకు ప్రథమ స్థానం : కలెక్టర్

డిఆర్‌డిఎ ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ తిరుమాని మురళీకృష్ణకు అభినందన

జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఉన్నతి రుణాల మంజూరు, రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమం స్థానం లభించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల ఉన్నతి రుణాలు మంజూరు రూ.7.75 కోట్లు లక్ష్యం కాగా, రూ.8.32 కోట్లు రుణాలను మంజూరు చేయడమే కాకుండా రుణాల రికవరీ 99.91 శాతం సాధించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. లక్ష్యానికి మించి రుణాల మంజూరు, రికవరీ చేయించడానికి కృషిచేసిన డిఆర్‌డిఎ ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ తిరుమాని మురళీకృష్ణను కలెక్టర్ నాగరాణి పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడేలా విరివిగా రుణాలను అందజేసి వారి అభ్యున్నతికి కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. ఉన్నతి రుణాల మంజూరులో జిల్లా అవార్డును సాధించడానికి తోడ్పాటును అందించిన ఎపిఎంలు, సిసిలు, విఒఎలు, ప్రాజెక్ట్ సిబ్బందిని అభినందించారు. డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ ఉన్నారు.

విద్యార్థులకు తల్లిదండ్రులు దిశానిర్దేశం చేయాలి

నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య గోడి సుధాకర్

పెనుమంట్ర : టెన్త్ అనంతరం పాఠశాల వదిలి కళాశాలలోకి ప్రవేశిస్తున్న పిల్లలు జాగ్రత్తగా చదువుకునేలా, అత్యంత జాగ్రత్తగా ఉండేలా తల్లిదండ్రులు, పెద్దలు దిశానిర్దేశం చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య గోడి సుధాకర్ హితవు పలికారు. మండలంలోని పొలమూరు గ్రామ ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన స్థానిక సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 26వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాడిపర్తి సంపత్ రావు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సచివాలయం ప్రణాళిక శాఖ జాయింట్ డైరెక్టర్ దిద్దే శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం ఇదే వేదిక పై ట్రస్ట్ ప్రతిభా పురస్కారం అందుకున్న నేను గ్రూప్-1 అధికారిగా మాట్లాడటం భావోద్వేగానికి గురిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పేదవారు కావొచ్చు కానీ ప్రతిభలో ఉన్నతులమని, అందరూ బాగా చదివి చాటిచెప్పారని, మీలాంటి ప్రతిభావంతులను ట్రస్ట్ ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. అనంతరం 10వ తరగతి పాసైన దళిత విద్యార్థులు 10 మందికి రూ.1000, మెమెంటో అందించారు. 592 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలచిన రావి అశ్విని, 578 మార్కులతో మండల టాపర్ కండేల్లి జ్యోష్న, పొలమూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 577 మార్కులతో టాపర్ దారపు రెడ్డి దుర్గతులసి, 568 మార్కులతో మండల ఎస్‌సి టాపర్ పిల్లి రత్నశ్రీలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు, మెమెంటో, పురస్కార పత్రం అందజేశారు. ఆళ్ల లావణ్య, డి.శ్రీకర ఫణి, తెన్నేటి మనోజ్, నెకూరి రేచల్‌జ్యోతి, రాపాక ప్రమీల, మెరిపే హర్షిత ఒక్కొక్కరి రూ.2 వేలు, మెమెంటో, పురస్కార పత్రం అతిథులు బహూకరించారు. ప్రధానోత్సవంలో విద్యార్థుల తల్లులను సన్మానించి కాళ్లకు నమస్కరింప చేశారు. డాక్టర్ ఉన్నమట్ల మునిబాబు సభను నడిపారు. కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, ఎంపిటిసి నరసింహమూర్తి, రిటైర్డ్ విఎల్ఒ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కాకర రాజేంద్ర, కేతా రామకృష్ణ, మానుకొండ దావీదు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ పరిశీలన

నరసాపురం: అన్నక్యాంటీన్లలో అందిస్తున్న ఆహార పదార్థాలు, సమయంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియజేయవచ్చని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని స్టీమర్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

'మండలాభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగాలి'

భీమవరం టౌన్: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

'పేదల వైద్య ఖర్చులు ప్రభుత్వం బరాయిస్తోంది'

పాలకొల్లు : గతంలో ఎన్నడు లేని విధంగా సిఎం చంద్రబాబు పేదల వైద్య ఖర్చులను ప్రభుత్వం బరాయిస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో పేద, మధ్యతరగతికి చెందిన 13 మందికి సోమవారం రూ.24.32 లక్షలు సిఎం సహాయనిధి చెక్కులను కూటమి నాయకులతో కలిసి మంత్రి తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM - HONOURABLE V ADDL, DISTRICT JUDGE -CUM- WOMEN COURT WEST GODAVARI DISTRICT AT ELURU

M.V.O. P. No.38/2025

Between:
Koduru Jyothi and 3 others ...Petitioners
And
Keshav D Vadher and others ...Respondents

To: **R1.** Sri. Kesha V D Vadher, S/o.Devabhai Vadher, Male, aged 41 years, Driver of Lorry Bearing No. GJ 36 V 3357, R/o Aayarvadi Ranava Porbandar City and District, Gujarat State-360545.

The 1st respondent shall be present before the Hon'ble court on **18-06-2025** at about 10:00 AM personally or through an advocate and to file if any counter in the above OP, otherwise ex-party orders will be passed against you in the above matter.

As per the orders of the Hon'ble 5th Additional District Judge Eluru dated **02-05-2025** please be published the above matter in your daily paper.

Date of Hearing:18-06-2025

Dr.Eluru Venkateswara Rao
Eluru Advocate, Eluru
Dt:10-05-2025 Cell:9440188677

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM - HONOURABLE VII ADDL, DISTRICT JUDGE -CUM- FAMILY COURT WEST GODAVARI DISTRICT AT ELURU

M.V.O. P. No.369/2024

Between:
Daraboina Swarna Latha and another ...Petitioners
And
Y.Tirupathi Rao and others ...Respondents

To: R6. Sri. Daraboina Chinna Rao @ Kiran Kumar S/o.Cheti Ram aged 50 Years, Properties R/o.SC Colony, Yellandu Village and Mandal, Bhadradri Kothagudem District, Telangana State-507123 KJCJC.

The 6th respondent shall be present before the Hon'ble court on **30-06-2025** at about 10:00 AM personally or through an advocate and to file if any counter in the above OP, otherwise ex-party orders will be passed against you in the above matter.

As per the orders of the Hon'ble 7th Additional District Judge Eluru dated 06-05-2025 please be published the above matter in your daily paper.

Date of Hearing:30-06-2025

Dr.Eluru Venkateswara Rao
Eluru Advocate, Eluru
Dt:10-05-2025 Cell:9440188677

గ్రంథాలయాల్లో నీతి కథలు

పెనుమంట్ర : విద్యార్థులు చదివే కథల్లో ఉన్న నీతిని గ్రహించాలని పెనుమంట్ర మానవత శాఖ అధ్యక్షులు, విశ్రాంత పిడి.కర్రి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఆయన పిల్లలకు మోరల్ స్టోరీస్, జనరల్ నాలెడ్జ్ విషయాలు వివరించారు. ఎం.కార్తీక్ స్వరూప్ రెడ్డి పాల్గొన్నారు. **నరసాపురం:** ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో పిల్లలకు కథలు చెప్పారు. రావి కృపారావు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని గుడ్ హ్యాండ్ రైటింగ్‌లో వారికి సులభమైన రీతిలో శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్త ఆర్.సుబ్బారావు, నాగజ్యోతి పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM - HONOURABLE V ADDL, DISTRICT JUDGE -CUM- WOMEN COURT WEST GODAVARI DISTRICT AT ELURU

M.V.O. P. No.37/2025

Between :
Dintakurthi Naga Durga Prasad ...Petitioner
And
Yarlagadda Ram Bhupal Gowd and others ...Respondents

To: **R2.** Smt.Sannala Bhavani W/o Rama Krishna, Female, aged not known, Owner of APSRTC Hired Bus Bearing No. AP 16 TF 8883, R/o D.No.5/216, Javvarupeta, Machilipatnam, Krishna District, AP-521001.

The 2nd respondent shall be present before the Hon'ble court on **20-05-2025** at about 10:00 AM personally or through an advocate and to file if any counter in the above OP, otherwise ex-party orders will be passed against you in the above matter. As per the orders of the Hon'ble 5th Additional District Judge Eluru dated **09-05-2025** please be published the above matter in your daily paper.

Date of Hearing:20-05-2025

Dr.Eluru Venkateswara Rao
Eluru Advocate, Eluru
Dt:10-05-2025 Cell:9440188677

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.No.2237 of 2023

Between:
Union Bank of India,
[A Govt. of India undertaking] [formerly] Andhra Bank Credit card Division rep. by its, Senior Manager Koti, Sultan Bazar, Hyderabad. ...Plaintiff.
And
Mr.Addala Satyanarayana, S/o. A. Venkata Rao, Aged about 45 years Occ: Business Prop. Dhanalakshmi Paints, 20-14-6, Chintal Doddi Rest House, Road, Dirusumarru Rd Bhimavaram-534 201-Andhra Pradesh ..Defendant.

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No.2237 of 2023 on the file of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs.1.40,967.56 pertaining to your credit card no.6528-63xx-xxxx-7000.You are therefore directed to appear in person or through Advocate on **23-06-2025** at **10.30**a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]

M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18, Chikkadapalli, Hyderabad.
Cell:98496-66587

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) GUDIVADA
Debtor Insolvency Petition No. 4/2025

Between :
Sonti Veera Babu, S/o Nagendra Rao, Age 34 yrs. Relatives Protection, R/o Ward No.31, Backside Sri Durga Temple, Near Dhaniyala Peta Canal, Gudivada, Krishna District, Cell No. 9160700999 ... Petitioner
AND
1) Polavarapu Subbaiah, S/o Not known, age 50 yrs, Business, R/o Chevuru (V), Mudinepalli (Mdl), Eluru District. Cell No. 9492708912.
2) Mohammad Noor, S/o Late Gouse, age 55 yrs, Business, R/o Valivarthipadu (V), Gudivada Rural Mandal, Krishna District, Cell No. 92486 22581.
3) Indian Oil Petrol Bunk, rep by its Proprietor Paturi Anjaiah at Chevuru, age 60 yrs, Business, R/o Chevuru (V), Mudinepalli Mdl, Eluru District. Cell No. 9247155198.
4) Sai Pavan Aqua Feeds & Needs, rep by its Proprietor Kosuri Raviraju at Singarayapalem, age 45 yrs, Business, R/o Singarayapalem (V), Mudinepalli (Mdl), Eluru District cell No. 960366333
5) Raviteja Aqua Traders, rep by its Proprietor Gudivalli Raviteja at Kothapalli, age 42 yrs, Business, R/o Kothapalli (V), Mudinepalli (Mdl), Eluru District. Cell No. 9100681516 ..... Respondents

ఈ నెంబరులో పిటీషనర్ Debtor IP లో జనరల్ నోటీసు నిమిత్తం ది. 10-7-2025వ తేదీకి వాయిదా వున్నది. కనుక వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ ఎవరికైనా ఆక్షేపణలుగానీ వున్న యెడల పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 10-7-2025

ఇట్లు
Katta Balakrishna,
గుడివాడ. **Advocate, Gudivada**
Cell No. 7093420723.

చేపల చెరువు లైసెన్స్ హక్కునకు
టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, బాబాయిపాలెం గ్రామములో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానము యొక్క హక్కు భుక్తములలో యున్న దిగువ ఉదహరించిన చేపల చెరువు 2025-26 సం॥ నుండి 2027-28 సం॥రం వరకు అనగా 3 సంవత్సరముల చేపల పెంపకం చేసుకొను లైసెన్సు హక్కు పొందుటకు ది. 28-05-2025వ తేదీ బుధవారం ఉదయం గం॥ 11.00 లకు బావాయిపాలెం గ్రామములో శ్రీ భీమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణము నందు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున టెండర్-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.సం.	భూమి ఉన్న గ్రామము	రీ.సర్వే నెం.	పరిమితి య.సెంట్లు	చెల్లించవలసిన ధరావత్తు రూ.
1	బావాయిపాలెం	304/1 304/2	0-17 6-93	60,000/-
2	॥	131/2	3-34	35,000/-
3	॥	475/2	1-13	15,000/-

__ముఖ్య షరతులు:__ 1) హెచ్చు పాటదారుడు పాట పూర్తి అయిన వెంటనే ఒక సంవత్సరము శిస్తు మొత్తము దేవస్థానం వార్కి చెల్లించు నిర్ణయం. 2) హెచ్చు పాటదారుడు మొదటి సం॥రం శిస్తు 10% పెంపుదల చేసి రెండవ సం॥రం శిస్తు చెల్లించు నిర్ణయం మరియు రెండవ సం॥రం శిస్తు 10% పెంపుదల చేసి మూడవ సం॥రం శిస్తు చెల్లించు నిర్ణయం. 3) మిగిలిన పాట షరతులు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిని అడిగి తెలుసుకొనవలెను.

ఇట్లు
గ్రామం: బావాయిపాలెం
తేది. 10-05-2025
కొమ్మిరెడ్డి సూర్యనారాయణ
కార్యనిర్వహణాధికారి